# సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 3 । జూలై । 2023




**సోమశిలలో నీటి నిల్వ**

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 29.348 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 91.419 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) - | రూ.60,130 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) - | రూ.5,400 |
| 3 శాతం జీఎస్టీతో.. - | రూ.5,562 |
| నవర (8 గ్రా) - | రూ.44,496 |

గరిష్ఠం/కనిష్ఠం 35.8 /30.5

**వాతావరణం**

ఆదివారం గాలిలో తేమ 51 శాతం ఉంది. సోమవారం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. వాతావరణం చల్లగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## న్యూస్‌రీల్

### 92.95 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్ అందించేందుకు శాంతినగర్‌కు చెందిన యాహోబ్ నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీసాజన్య

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా జరుగుతోంది. రెండో రోజు ఆదివారానికి మొత్తం 92.95 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ నగదును అందజేశారు. మొత్తం 3,04,686 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుకను అందజేయాల్సిఉండగా 2,83,192 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

### 18న సంచార జాతుల ఆత్మీయ సమ్మేళన సభ



నెల్లూరు(బారకాసు): సంచార జాతుల ఆత్మీయ సమ్మేళన సభ ఈ నెల 18వ తేదీన నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నామని తోటబొమ్మలాట కులస్తుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిందేశివ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంచార జాతులను రాజ్యాంగ పరిధిలోకి చేర్చాలని, సంచారజాతుల జాతీయ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తామన్నారు. సంచార జాతుల సంక్షేమం కోసం బీసీ–బి జాబితాలోకి చేర్చుతూ జీఓ నంబర్ 8ను విడుదల చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమజాతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం సమ్మేళన సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, గౌరవ సలహాదారుడు చినకొండయ్య, బ్రహ్మయ్య, సుబ్బారావు, నాగార్జున పాల్గొన్నారు.

### ఏపీ ఈ సెట్ ఫలితాల విడుదల

నెల్లూరు(టౌన్): పాలిటెక్నిక్ పూర్తి చేసి ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో చేరేందుకు నిర్వహించిన ఏపీ ఈ సెట్ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ పరీక్ష గత నెల 20న నిర్వహించారు. ఈ సెట్‌కు జిల్లావ్యాప్తంగా మొత్తం 691 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 625 మంది అర్హత సాధించారు. పురుషుల విభాగంలో 91.28 శాతం, మహిళల విభాగంలో 93.66 శాతం ఉత్తీర్ణత సాధించారు.

# ప్రగతి పరుగులు

- పొదలకూరులో రూ.100 కోట్లతో కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమ
- సర్వేపల్లి రిజర్వాయర్, కండలేరు హైలెవల్ కాలువ ఆధునికీకరణ
- సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణం ద్వారా నియోజకవర్గానికి సాగునీరు
- నేలటూరులో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు
- మత్స్యకారేతర ప్యాకేజీతో అండగా నిలిచిన ప్రభుత్వం
- సర్వేపల్లి అభివృద్ధిపై విమర్శలు చేసి అభాసుపాలైన లోకేశ్

## సర్వేపల్లి అభివృద్ధికి వందల కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధి అటకెక్కింది. కేవలం కమీషన్ల కోసం కక్కుర్తిపడిన టీడీపీ పాలకులు జేబులు నింపుకునే ప్రయత్నాలు చేశారు. ఇసుక మాఫియా నుంచి రైస్ మిల్లులు, రైతురథాలు, నీరు–చెట్టు తదితర పనుల్లో కమీషన్లు తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి తూట్లు పొడిచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులకు నిధులు విరివిగా కేటాయించడంతో ప్రగతి పరుగులెత్తింది. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించింది. అయితే ఆ నియోజకవర్గంలో జరిగిన యువగళం పాదయాత్రలో టీడీపీ నేత లోకేశ్ సర్వేపల్లిలో అభివృద్ధే జరగలేదంటూ ప్రజలను నమ్మించేలా వ్యాఖ్యలు చేసి నవ్వులపాలయ్యారు.



సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/పొదలకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కోట్లాది రూపాయల నిధులు కేటాయించి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించింది. గత టీడీపీ ప్రభుత్వంలోని పెండింగ్ పనులను సైతం పూర్తి చేసింది. అభివృద్ధి పనుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు మండలంలో కండలేరు హైలెవల్ కెనాల్ ఆధునికీకరణకు రూ.39.12 కోట్లు, సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణకు రెండు ప్యాకేజీల ద్వారా రూ.31 కోట్లు కేటాయించింది. ఈ పనులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. సాగునీటి కాలువలు, రిజర్వాయర్ ఆధునికీకరణ వల్ల వేలాది ఎకరాలు అదనంగా సాగులోకి రానున్నాయి. అలాగే కాలువలకు లైనింగ్ పనులు చేపట్టడం వల్ల రైతులకు సకాలంలో సాగునీరు అందే అవకాశం ఉంది. సంగం, నెల్లూరు బ్యారేజీల పనులను ప్రభుత్వం పూర్తి చేయడం వల్ల సర్వేపల్లి నియోజకవర్గంలో కనుపూరు కాలువ ద్వారా పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు, ముత్తుకూరు, టీపీ గూడూరు మండలాలకు సక్రమంగా సాగునీరు అందుతోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చుక్కల భూముల సమస్యలను పరిష్కరించేలా ఇచ్చిన జీఓతో జిల్లాలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు పరిష్కారం లభించింది. తద్వారా జిల్లాలో 23,023 మంది రైతులకు సంబంధించిన 43,270 ఎకరాల చుక్కలు భూములు, 2,527 మంది అన్నదాతలకు సంబంధించిన 22ఏ నిషేధిత భూములు 3,756 ఎకరాలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఇందులో సర్వేపల్లి నియోజకవర్గ రైతులు కూడా ఉన్నారు. వీరికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పాసుపుస్తకాలను అందజేశారు.



కండలేరు ఎడమగట్టు కాలువకు చేసిన లైనింగ్ పనులు (ఫైల్)

> **సర్వేపల్లి అభివృద్ధే లక్ష్యం**
>
> ఏ పదవిలో ఉన్నా నిరంతరం సర్వేపల్లి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తాను. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం మంత్రిగా పనిచేస్తున్నానంటే సర్వేపల్లి ప్రజలు ఆదరించడం వల్లనే సాధ్యమైంది. ఎల్లవేళలా ప్రజలకు జవాబుదారీగా ఉంటాను. ప్రతిపక్షాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులతోనే సమాధానం చెబుతున్నాను.
>
> – కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి



**పారిశ్రామికాభివృద్ధి**

సర్వేపల్లి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన జరుగుతూనే ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమల స్థాపన ఊపందుకుంది. నేలటూరు థర్మల్ విద్యుత్ ప్లాంట్‌తో పాటు గత నెల 26వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామ పరిధిలో రూ.610 కోట్లతో క్రిబ్కో బయోఇథనాల్ ప్లాంట్, రూ.315 కోట్లతో విశ్వసముద్ర బయోఇథనాల్ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. పొదలకూరు మండలంలో రెండేళ్ల క్రితం వ్యవసాయ పనిముట్లు, యంత్రాల తయారీ కోసం కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమను రూ.100 కోట్లతో స్థాపించారు. ఇక్కడ 75 శాతం మంది స్థానికులకు ఉద్యోగాలు కేటాయించడంతో యువతకు ఉద్యోగావకాశాలు లభించాయి.

**రహదారుల నిర్మాణానికి నిధులు**

గత టీడీపీ హయాంలో 2015వ సంవత్సరంలో వచ్చిన వరదలకు దెబ్బతిన్న మనుబోలు వద్ద ఎన్‌హెచ్ 16 హైవే రోడ్డు పనులను రూ.135 కోట్లతో పునర్నిర్మాణం చేసి ఇటీవల ప్రారంభించారు. హైవే పనులను పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతులైన అంతర్గత సిమెంటురోడ్లు, సైడ్ డ్రెయిన్లు తదితర నిర్మాణాల కోసం రూ.320 కోట్లను ప్రభుత్వం కేటాయించగా, ఈ నిధులతో పనులు పూర్తికావడం గమనార్హం. నియోజకవర్గంలోని పెద్దమండలమైన ఒక్క పొదలకూరులో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.100 కోట్ల వరకు నిధులను వెచ్చించింది. ఇలా రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి నియోజకవర్గంలో వందలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రగతిని పరుగులు పెట్టిస్తే టీడీపీ నేత లోకేశ్ ముత్తుకూరులో జరిగిన యువగళం పాదయాత్ర సందర్భంగా నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదంటూ వ్యాఖ్యలు చేసి అభాసుపాలయ్యారు.

### మత్స్యకారేతర ప్యాకేజీ

ముత్తుకూరు మండలంలో మత్స్యకారేతర కుటుంబాలకు చెందిన అర్హులైన వారికి మత్స్యకారేతర ప్యాకేజీని ప్రభుత్వం అందించింది. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కాకాణి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మత్స్యకారేతరులకు ప్రత్యేకంగా రూ.36 కోట్ల నిధులను సాధించి వారికి అందజేయడంతో వారి ఆనందానికి అవధులు లేవు.

# విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



గురుకుల పాఠశాలకు మంత్రి సొంత నిధులతో అందజేస్తున్న పరికరాలు

వెంకటాచలం: విద్యార్థినీ, విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు పోటీతత్వంతో చదవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. వెంకటాచలం మండలం సరస్వతీనగర్‌లోని యానాదుల ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం.హరి నారాయణన్‌తో కలిసి మంత్రి కాకాణి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని, శాశ్వతమైనది విద్య మాత్రమేనని తెలిపారు. విద్యతో అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించవచ్చన్నారు. పొదలకూరు మండలం మహ్మదాపురానికి మంజూరైన గురుకుల పాఠశాలను అక్కడ సరైన భవనాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకుని సరస్వతీనగర్‌లోని యానాదుల ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభించామన్నారు. దీని కోసం ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చదివించేందుకు మొగ్గుచూపుతున్నారని, ఈ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కలిగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత చదువులు చదివేలా ముందుకుసాగాలని సూచించారు. క్యాంపస్ ఎంపికల్లో ఉద్యోగాలు పొందాలంటే పోటీ పడి చదవాలన్నారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధితోనే నిజమైన ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాదని, జీవితంలో మనిషి ఎలా ఉండాలో నేర్పేదే విద్య అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.62 వేల కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించి అనేక పనులు చేపట్టిందని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యత, అనేక అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం గురుకుల పాఠశాలకు మంత్రి కాకాణి సొంత నిధులు వెచ్చించి తీసుకువచ్చిన పలు రకాల వస్తువులను గురుకుల పాఠశాలల కన్వీనర్ కొండల్‌రావుకు అందజేశారు. అలాగే విద్యార్థినీ, విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన పళనిని మంత్రి, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మందా కవిత, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి వెంకటయ్య, ఐటీడీఏ పీఓ రాణి మందా, గురుకుల పాఠశాలల డిప్యూటీ సెక్రటరీ మాధవయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

# లోకేశ్ సైకోలా వ్యవహరిస్తున్నారు

- రాష్ట్ర జంగం కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న



నెల్లూరు(దర్గామిట్ట): నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో సైకోలాగా వ్యవహరిస్తున్నారని, ఆయన సభలో మాట్లాడుతున్న ప్రతి స్క్రిప్ట్ రైటర్ ఇస్తున్నదే మాట్లాడుతున్నారని రాష్ట్ర జంగం కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న అన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ గచ్చిబౌలిలో బీజేపీ నాయకుడు అనిల్‌కుమార్‌యాదవ్ చేసిన గొడవను నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ చేసినట్లుగా మాట్లాడడం లోకేశ్ తెలివి తక్కువతనానికి నిదర్శనమన్నారు. యువగళం పాదయాత్ర ఎప్పుడు ముగుస్తుందా అంటూ తెలుగుదేశం కార్యకర్తలే తలలు పట్టుకుంటున్నారని అన్నారు. శనివారం రాత్రి నెల్లూరులోని నారాయణ వైద్యకళాశాలలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని, నారాయణ విద్యాసంస్థల్లో నెలకోసారి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, దీనిపై విచారణ జరిపించాలన్నారు. దీనిపై కలెక్టర్, ఎస్పీలకు సైతం తెలియచేస్తామన్నారు.

# ఎంఈఓ–1గా 13 మంది నియామకం

నెల్లూరు(టౌన్): జిల్లాలో 13 మందిని ఎంఈఓ–1లుగా నియమించారు. ఈ మేరకు ఆదివారం ఆర్జేడీ కార్యాలయం నుంచి జిల్లా కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్–2 హెడ్‌మాస్టర్లుగా పనిచేస్తున్న వారిలో సీనియారిటీ, అంగీకారం మేరకు వారిని ఎంఈఓ–1లుగా నియమించారు. వీరంతా సోమవారం ఆయా మండలాల్లో ఎంఈఓ–1గా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎంఈఓ–1గా నియమించిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయగిరిలోని ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం కె.బిక్షాలును నెల్లూరు రూరల్, మూలగుంటపాడు హైస్కూల్‌లో పనిచేస్తున్న హెచ్‌ఎం వి.వెంకటేశ్వరరావును ఇందుకూరుపేట, ఆత్మకూరు హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.శేషాద్రివాసును మనుబోలు, నెల్లూరు నగరంలోని సంతపేట హైస్కూల్ హెచ్‌ఎం వి.తిరుపాలును నెల్లూరు అర్బన్, మైపాడులో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటజానకిరామ్‌ను సంగం, పెళ్లకూరు హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.భాస్కరరావును వెంకటాచలం, సూళ్లూరుపేట హైస్కూల్ హెచ్‌ఎం కె.రేణుకను పొదలకూరు, సంగం మండలం కొరిమెర్ల హైస్కూల్ హెచ్‌ఎం ఎం.శాంతిని నాయుడుపేట, రాపూరులోని ఎస్‌బీటీ జీజీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పి.పెంచలనరసింహారావును బోగోలు, కుల్లూరు హైస్కూల్ హెచ్‌ఎం ఎన్.రవీంద్రనాథ్ అల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం డీఎల్‌ఎన్‌ఆర్ జీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వి.నాగపద్మను విడవలూరు, బండ్లమిట్ట హైస్కూల్ హెచ్‌ఎం డి.శాంతకుమార్ చిల్లకూరు, గుంటూరు జిల్లా మాచెర్ల హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న బి.గోవిందయ్యను కావలి ఎంఈఓ–1లుగా నియమించారు.

# ఆయుష్‌కు ఆయువు

ప్రస్తుతం ఇంగ్లిష్ వైద్యం రాజ్యమేలుతున్నప్పటికీ ఆయుర్వేదం, యునాని, ప్రకృతి వైద్యం, హోమియో వైపు ప్రజలు దృష్టి సారిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని ఆయుష్ వైద్యశాలల్లో వైద్యులను నియమించడంతోపాటు మందుల కేటాయింపును ఇతోధికంగా పెంచింది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు ఆయా ఆస్పత్రులకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు.

- ఆయుర్వేదానికి పెరుగుతున్న ఆదరణ
- హోమియోను ఆశ్రయిస్తున్న ప్రజలు
- కేరళ బ్రాండెడ్ కంపెనీల నుంచి మందులు
- ఆయుష్‌కు ప్రభుత్వం నిధుల కేటాయింపు
- గత ప్రభుత్వంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం



వైద్యశాలలో ప్రభుత్వం అందజేసిన ఆయుర్వేద మందులు

| | |
|---|---|
| జిల్లాలో ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలు : 24 | ఆయుర్వేదిక్ ఆస్పత్రి : 1 (అల్లూరు) |
| హోమియో వైద్యశాలలు : 13 | యునాని ఆస్పత్రులు : 6 |
| గతంలో మందుల బడ్జెట్ : రూ.20 వేల నుంచి రూ.40 వేలు | |
| ప్రస్తుతం మందుల బడ్జెట్ : రూ.70 వేల నుంచి రూ.1.25 లక్షలు | |


పొదలకూరు: అల్లోపతి(ఇంగ్లిషు) వైద్యం వైపు పరుగులు తీస్తున్న కాలంలోనూ ఆయుర్వేద వైద్యంపై నమ్మకం ఉన్న ఎందరో లేహ్యాలు, చూర్ణాలను ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం ఆయుష్(ఆయుర్వేద, యోగా, నాచురోపతి, యునాని, సిద్ధ, హోమియో)కు ఆయువు పోసింది. గత ప్రభుత్వంలో ఆయుష్‌కు నిధుల కేటాయింపులో మీనమేషాలు లెక్కించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారు. దీంతో ఆయుష్‌ను జనాలు మరచిపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ప్రభుత్వం పై అంశాలను గుర్తించి వైద్యులను నియమించడంతోపాటు మందుల కేటాయింపును ఇతోధికంగా పెంచింది. అయితే గత ప్రభుత్వాలు చేసిన తప్పిదం వల్ల పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం చేపట్టలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఆయుష్‌లో రాతపరీక్షల ద్వారానే నియామకాలు చేపట్టాలని ఉత్తర్వులను తీసుకురావడంతో సాంకేతికంగా నియామకాల్లో చిక్కులు వచ్చినట్లు తెలుస్తోంది. పొదలకూరు మండలంలోని విరువూరు గ్రామంలో ఏడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేసింది. అల్లోపతి(ఇంగ్లిషు వైద్యం) ప్రాచుర్యంలో లేని కాలంలో విరువూరు ఆయుర్వేద వైద్యశాల చుట్టుపక్కల గ్రామాలకు వైద్యసేవలందించింది.

**కేరళ కంపెనీల నుంచి మందులు**

జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలు, ఆస్పత్రులకు ప్రభుత్వం కేరళ నుంచి బ్రాండెడ్ కంపెనీ మందులను దిగుమతి చేసుకుంటోంది. కేరళ రాష్ట్రం ఆయుర్వేదిక్ మందులకు ప్రసిద్ధి కనుక దాదాపుగా అన్నిరకాల మందులను అక్కడి నుంచి ప్రభుత్వం దిగుమతి చేస్తుంది. గత ప్రభుత్వంలో డిస్పెన్సరీలకు రూ.20 వేల నుంచి రూ.40 వేల బడ్జెట్‌తో అందజేసే మందులను ప్రభుత్వం ఇపుడు రూ.70 వేల నుంచి రూ.1.25 లక్షల వరకు బడ్జెట్ పెంచి మంచి నాణ్యమైన ఆయుర్వేదిక్ మందులను అందజేస్తోంది.

**అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం**

2008వ సంవత్సరంలో నేషనల్ రూరల్ హెల్త్ మిషన్(ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) ద్వారా జిల్లాలో 24 మెడికల్ డిస్పెన్సరీల్లో అవుట్ సోర్సింగ్ కింద హోమియోపతి వైద్యం కోసం డాక్టర్లు, సిబ్బందిని నియమించారు. అయితే డాక్టర్లకు 2012లో రెగ్యులర్ ఉద్యోగాలు రావడంతో వెళ్లిపోయి ఇద్దరే మిగిలారు. సిబ్బంది మాత్రమే ఆయా హోమియో క్లినిక్స్‌లో ఉండిపోయారు. 2017వ సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం డాక్టర్లు లేని హోమియో క్లినిక్స్ ఎందుకని తొలగించి అక్కడ పనిచేసే సిబ్బందిని ఇళ్లకు పంపింది. అయితే ఇపుడు వారిని తిరిగి ప్రభుత్వం తీసుకున్నా వారు సీనియారిటీ కోల్పోవడం, అవుట్ సోర్సింగ్‌లో పనిచేయడం వల్ల రెగ్యులర్ కాలేకపోయామని చెబుతున్నారు.




విరువూరు ఆయుర్వేద వైద్యశాల

**వెల్‌నెస్ సెంటర్లు**

ప్రస్తుతం జిల్లాలో ఆయుష్ కింద పనిచేస్తున్న ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలను, ఆస్పత్రి(అల్లూరు)ని వెల్‌నెస్ సెంటర్లుగా గుర్తించి అక్కడ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి ఆయా ప్రాంతాల్లోని గ్రామాల్లో యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు యోగా, ధ్యానం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్నారు. దీర్ఘకాలిక రుగ్మతలకు యోగా ఉపశమనం కలిగిస్తుందని అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక ఆయుర్వేదంలో విశేషంగా పేర్కొనే పంచకర్మ చికిత్స(హోల్ బాడీ చెకప్)లో భాగంగా ఎలాంటి శస్త్రచికిత్స లేకుండా దీర్ఘకాలిక రుగ్మతలను బాగు చేసేందుకు ఎంపిక చేసిన కేంద్రాల్లో చికిత్స అందిస్తున్నారు. ఇందులో భాగంగా పొదలకూరు మండలంలోని విరువూరు ఆయుర్వేద కేంద్రం కూడా ఎంపికైంది. అల్లూరులో నిరంతరం పంచకర్మ చికిత్స ఉచితంగా నిర్వహిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కూడా రోగులు అక్కడికి వచ్చి వైద్యం పొందుతున్నారు.

**ఎంతో ఉపయోగం**



మా గ్రామంలో దశాబ్దాలుగా ఉన్న ఆయుర్వేద కేంద్రంలో విలువైన వైద్యసేవలు ప్రజలకు అందుతున్నాయి. డాక్టర్ నిత్యం రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. మందులు నాణ్యమైనవి ఇస్తుండడంతో రోగుల సంఖ్య బాగా పెరిగింది. ముఖ్యంగా షుగర్, బీపీలకు ఇచ్చే మందులు బాగా పనిచేస్తున్నాయి.

– జి.దయాకర్‌రెడ్డి, స్థానికుడు, విరువూరు

**నాణ్యమైన మందుల పంపిణీ**



నాణ్యమైన ఆయుర్వేద మందులను ప్రభుత్వం సమృద్ధిగా అందిస్తోంది. కేరళ బ్రాండెడ్ కంపెనీ మందులు కేంద్రానికి పంపుతున్నారు. రోగుల సంఖ్య బాగా పెరిగినప్పటికీ సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. ఆయుర్వేదంలో అన్నిరకాల జబ్బులకు వైద్యం, మందులు ఉన్నాయి.

– పి.వినోద్‌బాబు, ఆయుర్వేద వైద్యాధికారి, విరువూరు

## క్లుప్తంగా

### ప్రిన్సిపల్‌ను కలిసిన ఉద్యోగ సంఘ నాయకులు



ప్రిన్సిపల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరులోని ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జమునను ఆదివారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చేమూరు రవికుమార్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు శివ, రమేష్, చిన కొండలు తదితరులు పాల్గొన్నారు.

### కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బోయలచిరివెళ్ల గ్రామంలో జరిగింది. ఆత్మకూరు ఎస్సై సాయిప్రసాద్ ఆదివారం వివరాలు వెల్లడించారు. బోయలచిరివెళ్లకు చెందిన చల్లా సురేష్ (35), సురేఖ దంపతులకు కూతురు, కుమారుడున్నారు. సురేష్ బేల్దారి పనులు చేసేవాడు. వారు మూడు నెలల క్రితం ఆత్మకూరు పట్టణంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. సురేఖ టైలరింగ్ పనులు చేస్తోంది. పిల్లలిద్దరిని ఆత్మకూరులో చదివిస్తున్నారు. సురేష్ మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో శనివారం దంపతుల మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. దీంతో సురేష్ బోయలచిరివెళ్లలోని తన పొలం వద్దకు వెళ్లి మద్యంలో పురుగు మందు కలిపి తాగాడు. సమాచారం తెలుసుకున్న గ్రామంలోని కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం తొలుత ఆత్మకూరులో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### డాక్టర్ బిందుమీనన్‌కు ఐఎంఏ అవార్డు



అవార్డు అందుకుంటున్న బిందుమీనన్

నెల్లూరు(బారకాసు): అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్, న్యూరాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ బిందుమీనన్ ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్స్ డే అవార్డు- 2023ని అందుకున్నారు. సమాజ, వైద్య రంగంలో సేవలకు గానూ జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును స్వీకరించారు. అవార్డును అందుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. తన పేరును సిఫార్సు చేయడంలో కీలకపాత్ర పోషించిన డాక్టర్ అశోక్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఫణిధర్, డాక్టర్ శ్రీరామ్ సతీష్, నవీన్‌కు ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మానికల రమణయ్య (56) అనే వ్యక్తి మృతిచెందగా, సింగిరి శీనయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. జొన్నవాడకు చెందిన సింగిరి శీనయ్య పెనుబల్లి వైపు బైక్‌పై వస్తుండగా, పెనుబల్లికి చెందిన రమణయ్య జొన్నవాడ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో బైక్ అదుపుతప్పడంతో రమణయ్యను బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమణయ్య తలకు తీవ్రగాయాలవగా, బైక్‌పై ఉన్న శీనయ్యకు కూడా గాయాలయ్యాయి. ఇద్దరినీ నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతున్న రమణయ్య ఆదివారం వేకువన మృతిచెందాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 135 |
| లేయర్ (లైవ్) | : 108 |
| బ్రాయిలర్ చికెన్ | : 232 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 258 |
| లేయర్ చికెన్ | : 184 |

### పొదలకూరు నిమ్మధరలు (కిలో)



| | |
|---|---|
| పెద్దవి | : రూ.26 |
| సన్నవి | : రూ.15 |
| పండ్లు | : రూ.5 |

# నాణ్యతే ముఖ్యం

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నాణ్యత లేని ఆహార పదార్థాల విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ముమ్మరంగా దాడులు చేస్తున్నారు. జిల్లాలో చిన్నచిన్న హోటళ్లు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించే వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- ఆహార విక్రయ దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు
- మూడు నెలల్లో 42 కేసుల నమోదు
- రూ.4.50 లక్షల జరిమానా వసూలు



నెల్లూరులోని ఓ హోటల్లో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో ఆహార పదార్థాలు విక్రయించే హోటళ్లు, చిన్న దుకాణాలు తదితర వాటిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నా పలువురి తీరులో మార్పు రావడం లేదు. ఇష్టానుసారంగా నాణ్యత లేని ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయాలు సాగిస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. దీంతో అధికారులు దాడులు ముమ్మరం చేశారు. ఆరునెలల కాలంలో నిర్వాహకులపై 42 కేసుల వరకు నమోదు చేశారు. సుమారు రూ.4.50 లక్షల జరిమానా విధించారు. ఆహార పదార్థాలను ల్యాబ్‌కు తరలించి పరీక్షలు చేసిన తర్వాత నివేదిక ఆధారంగా కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తుంటారు.

**ప్రత్యేక పరికరాలు**

చాలాచోట్ల వంటనూనెను ఎక్కువసార్లు వినియోగించి ఆహార పదార్థాలను తయారు చేస్తుంటారు. అవి తిన్నవారికి జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో టోటల్ పోలార్ కాంపోర్డ్ (టీపీసీ) అనే పరికరం ద్వారా అధికారులు పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీని ద్వారా నూనెను ఎక్కువసార్లు వినియోగించారని తెలిస్తే చర్యలు తీసుకుంటున్నారు. పదేపదే వేడి చేసిన నూనెను వాడకుండా జిల్లాలోని 60 హోటళ్ల నిర్వాహకులు బయో డీజిల్ కోసం విక్రయిస్తున్నారు.

**600 మందికి శిక్షణ**

జిల్లాలో వివిధ చోట్ల ఆహార పదార్థాలు విక్రయిస్తున్న 600 మందికి ఫుడ్ సేఫ్టీ అధికారులు, నెస్లే సంస్థ కలిసి ఇటీవల ఐదురోజులపాటు శిక్షణ ఇచ్చారు. నాణ్యతా ప్రమాణాలు ఎలా పాటించాలి?, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



శిక్షణ తీసుకున్న వారితో అధికారులు (ఫైల్)

**మూడు రకాల లైసెన్స్‌లు**

ఫుడ్ సేఫ్టీ అధికారులు మూడు రకాల లైసెన్స్‌లను జారీ చేస్తారు. ఏడాదికి రూ.12 లక్షల లోపు వ్యాపారం చేసే వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. దీనికి రూ.100 ఫీజు కట్టాలి. ఏడాదికి రూ.12 లక్షల పైన.. రూ.20 కోట్ల లోపు వ్యాపార లావాదేవీలు జరిపే వారు లైసెన్స్‌లు తీసుకోవాలి. ఇందుకు సంవత్సరానికి రూ.2 వేలు నుంచి రూ. 5 వేల వరకు చెల్లించాలి. ఆయా దుకాణాలు, పరిశ్రమల ఆధారంగా లైసెన్స్ ఫీజు ఉంటుంది. ఏడాదికి రూ.20 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిపే వారు సెంట్రల్ లైసెన్స్‌లు పొందాలి.

**లైసెన్స్‌లు తీసుకోవాలి**



జిల్లాలోని ఆహార పదార్థాలు విక్రయించే వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్స్ చేయించుకోవాలి. లైసెన్స్‌లు తీసుకోవాలి. నాణ్యత లేని వాటిని విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు, జరిమానా, జైలు శిక్ష విధిస్తారు. ప్రజలు వినియోగించే ఆహార పదార్థాల విషయం రాజీ పడేది లేదు.

– వెంకటేశ్వరరావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి




మద్యం షాపు వద్ద కార్యకర్తలు (టీ షర్ట్‌లు ధరించిన వారు) పెగ్గు కలుపుతూ..

# మత్తులో తమ్ముళ్లు

నారా లోకేశ్ యువగళం పాదయాత్ర తెలుగు తమ్ముళ్లకు ఫుల్ కిక్ ఇచ్చింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో ఆదివారం యాత్ర జరిగింది. ఈ క్రమంలో లోకేశ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చిత్రాలున్న టీ షర్ట్‌లు ధరించిన టీడీపీ కార్యకర్తలు మద్యం దుకాణాలకు చేరుకుని ఎంజాయ్ చేశారు. వారిని చూసిన ప్రజలు ఆశ్చర్యపోయారు. మద్యం మత్తులో ఘర్షణలు జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

# నేరాల కట్టడికి స్పెషల్ పార్టీతో గస్తీ



గస్తీ విధుల్లో పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): నేరాల కట్టడే లక్ష్యంగా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి చర్యలు తీసుకున్నారు. నెల్లూరు నగరంలో పగలు, రాత్రి గస్తీని పటిష్టం చేశారు. రోజూ సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు విజిబుల్ పోలీసింగ్, రాత్రి వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులపై కొరడా ఝుళిపిస్తున్నారు. మద్యం దుకాణాల బయట, పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాపుల వద్ద మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. కూల్‌డ్రింక్ షాపుల వద్ద మద్యం తాగేందుకు అనుమతిస్తే కేసులు నమోదు చేస్తామని దుకాణ యజమానులను హెచ్చరిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లు, ఆర్టీసీ బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్ల వద్ద అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వేలిముద్రలను ఫిన్ పరికరంతో పరిశీలించి నేరాలు జరగకుండా జాగ్రత్తలు చేపడుతున్నారు. రాత్రి బీట్ వ్యవస్థను పెంచారు. ప్రతి స్టేషన్‌కు ఐదుగురు స్పెషల్ పార్టీ సిబ్బందిని కేటాయించి వారికి ఆయుధాలను అందజేశారు. వీరు స్థానిక పోలీసు అధికారులతో కలిసి రాత్రి గస్తీలు నిర్వహిస్తున్నారు. ప్రజా జీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారికి తమదైన శైలిలో కౌన్సిలింగ్ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా డయల్ 100, 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని నగర ప్రజలకు పోలీసు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# 'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: జగనన్న సురక్ష' కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి రూరల్ మండలం పెద్ద పట్టపుపాళెం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రస్తుతం విద్యా సంస్థల్లో అడ్మిషన్ల సమయం కావడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఆదాయం, కుల సర్టిఫికెట్లు అవసరమయ్యాయని, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారికి ఎంతో మేలు జరిగిందని వివరించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా, కొన్ని సాంకేతిక సమస్యల వల్ల అక్కడక్కడా కొందరు సంక్షేమ పథకాలకు దూరమయ్యారని, వారికి లబ్ధి చేకూర్చే విధంగా జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఖరీఫ్ సీజన్ కావడంతో చాలామంది కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు పొందడానికి ఈ క్యాంపులు బాగా ఉపయోగపడ్డాయని వివరించారు. ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ సేవలను కూడా చాలా మంది పొందారని, మ్యుటేషన్ కోసం అనేకమంది తమ సర్వీసులను రిజిస్టర్ చేసుకున్నారని, వాటిని ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరిస్తున్నారని తెలియజేశారు. ఈ సురక్ష కార్యక్రమంలో ఎలాంటి రుసుము లేకుండా పూర్తి స్థాయిలో ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఆటోను ఢీకొన్న కారు

- ఐదుగురికి స్వల్ప గాయాలు



దెబ్బతిన్న ఆటో వెనుక భాగం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : మర్రిపాడు మండలం కృష్ణాపురం సమీపంలో ఆదివారం సాయంత్రం ముందు వెళ్తున్న ఆటోను వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మర్రిపాడు పోలీసుల వివరాల మేరకు.. అనుమసముద్రంపేట మండలం గుడిపాడుకు చెందిన షంషుద్దీన్ అనే విద్యార్థికి కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం లభించింది. దీంతో అతడ్ని కళాశాలలో చేర్చేందుకు తన బంధువులతో కలిసి ఆటోలో బయలుదేరారు. కృష్ణాపురం సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా ఆటో పొలాల వైపు దూసుకెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థితోపాటు అమ్మమ్మ బీబీజాన్, బంధువులు సిరాజ్, అఫ్రీన్, డ్రైవర్ ఖాజారసూల్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నెల్లూరు ఆస్పత్రికి తరలించింది. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


### రెండు బైక్‌ల ఢీ

- యువకులకు గాయాలు

పొదలకూరు : పట్టణంలోని కాకాణి నగర్‌కు సమీపంలో ఆదివారం రెండు మోటార్‌బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఎస్సై కరిముల్లా కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరుకు చెందిన అబ్దుల్ ముబారక్ రెహమాన్, వెంకటగణపతి పొదలకూరులో స్నేహితుల ఇంటికి వచ్చారు. వారు నెల్లూరుకు తిరిగి వెళ్తుండగా పల్సర్ బైక్‌పై అతివేగంగా, నిర్లక్ష్యంగా వెళ్తున్న యువకుడు హోండాషైన్లో వెళ్తున్న ముబారక్, వెంకటపతిల బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఖాతాదారుల సొమ్ము.. ఇట్టే కొట్టేస్తున్నారు

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- నకిలీ వేలిముద్రలతో ఖాతాలోని సొమ్ము ఖాళీ
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసు అధికారులు



నెల్లూరు(క్రైమ్): కష్టపడి సంపాదించి బ్యాంక్‌ల్లో దాచుకున్న సొమ్మును సాంకేతిక సాయంతో సైబర్ నేరగాళ్లు ఇట్టే దోచేస్తున్నారు. తమ ప్రమేయం లేకుండానే బ్యాంక్ ఖాతాల్లోని నగదు మాయమవుతుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. బ్యాంక్‌లను సంప్రదిస్తే ఏఈపీఎస్ ఆధారంగా నకిలీ వేలిముద్రలతో సైబర్ నేరగాళ్లు నగదు కాజేస్తున్నారని చెబుతుండడంతో చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు.

**అనుకూలంగా మార్చుకుని..**

ఏటీఎం సౌకర్యం లేని ప్రాంతాల్లో బ్యాంక్ ఖాతాదారులు వేలిముద్రలు వేసి ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్) ద్వారా రోజుకు రూ.10 వేల వరకు డ్రా చేసుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఈ అవకాశాన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులు, ఇతర ప్రాంతాల్లో వేలిముద్రలు వేసుంటే వాటిని స్కాన్ చేసి డబ్బు కొల్లగొడుతున్నారు. ప్రధానంగా రిజిస్ట్రేషన్ కార్యాలయ వెబ్‌సైట్ల నుంచి వేలిముద్రలను సేకరిస్తున్నారు. వాటిని పోలిన విధంగా వేలిముద్రలను తయారు చేసి ప్రత్యేక మెషీన్లు, యాప్‌ల ద్వారా ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి రూ.లక్షల్లో నగదు దోచేస్తున్నారు. కష్టపడి దాచుకున్న సొత్తును నేరగాళ్లు మాయం చేస్తుండడంతో బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. జిల్లాలో బ్యాంక్‌లు, పోలీస్‌స్టేషన్లకు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. బ్యాంక్‌లపై ఉన్న భరోసా ప్రజల్లో సన్నగిల్లుతోంది.

**ప్రత్యేక దృష్టి**

సైబర్ మోసాలపై ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సైబర్ క్రైమ్ సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారంగా కేసులను ఛేదిస్తున్నారు. నకిలీ వేలిముద్రలతో రూ.51.25 లక్షల నగదును బ్యాంక్ ఖాతాల నుంచి కాజేసిన పదిమంది సభ్యులతో కూడిన ముఠాను ఇటీవల నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

**లాక్ చేసుకుంటే..**

ఎం ఆధార్ యాప్‌తో భద్రత లభిస్తుంది. దీనిని మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని కుటుంబసభ్యులందరి ఆధార్ వేలిముద్రలను లాక్ చేసుకోవచ్చు. ఒక్కసారి లాక్‌చేసిన తర్వాత ఎక్కడా తెరుచుకోవు. మనం వేలిముద్రలు వేయాలన్నా అన్‌లాక్ చేయాల్సిందే. అవసరం ఉన్నప్పుడే అన్‌లాక్ చేసుకుని పని పూర్తవగానే మళ్లీ లాక్ చేసుకోవడం ద్వారా నగదు కోల్పోయే అవకాశం ఉండదు.

**దృష్టి సారించాం**



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరగాళ్లు ఏఈపీఎస్ ద్వారా నకిలీ వేలిముద్రలతో బ్యాంకు ఖాతాల్లోని నగదు కాజేస్తున్నారు. ఈ తరహా నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎం ఆధార్ యాప్ ద్వారా ప్రతి ఒక్కరూ ఆధార్ బయోమెట్రిక్‌ను లాక్ చేసుకోవాలి. అవసరం ఉన్నప్పుడు మాత్రమే అన్‌లాక్ చేసుకోవాలి. ఇటీవల ఎక్కడైనా వేలిముద్రలు వేసిన సందర్భాలుంటే అక్కడికి వెళ్లి ముద్రలను డీ లింక్ చేసుకోవాలి. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ